# నవతరం

తెలుగు దినపత్రిక

RNI NO. APTEL/2014/58326

సంపుటి : -13 సంచిక : 114 ఎడిషన్ ఇన్‌ఛార్జ్ : నవచైతన్య శిరిగిరి

శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం రాజమండ్రి

03-03-2026 మంగళవారం వెల : 1 /- పేజీలు : 4


## వినూత్నంగా వినతులను స్వీకరించిన కేంద్ర మంత్రి

- వీడియో కాన్ఫరెన్స్ ద్వారా డిల్లీ నుండి వినతులు స్వీకరించిన కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు.
- నేరుగా డిల్లీలో ఉన్న కేంద్ర మంత్రితో మాట్లాడి తమ బాధలు చెప్పుకున్న శ్రీకాకుళం వాసులు.
- భవిష్యత్ లో ప్రజాదర్బార్ కార్యక్రమాన్ని మరింత విస్తృతం చేయనున్న రామ్మోహన్ నాయుడు.

2లో





## పబ్లిక్ గ్రీవెన్స్‌లో 56 పిర్యాదులు స్వీకరణ

## ప్రజా పిర్యాదులను పూర్తి స్థాయిలో పరిష్కారం చూపాలి

**నవతరం -శ్రీకాకుళం**

ప్రజా పిర్యాదులను పూర్తి స్థాయిలో పరిష్కారం చూపాలి అని పోలీసు అధికారులను జిల్లా ఎస్పీ కెవి మహేశ్వర రెడ్డి ఆదేశించారు. జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా పిర్యాదులు స్వీకరణ మరియు పరిష్కారం కార్యక్రమంలో జిల్లా ఎస్పీ శ్రీ కె.వి. మహేశ్వర రెడ్డి ఐపిఎస్ గారు ప్రజల నుంచి నేరుగా పిర్యాదులు స్వీకరించారు. ఈ సందర్భంగా జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ప్రజల వద్ద నుంచి మొత్తం 56 పిర్యాదులు స్వీకరించి, పిర్యాదుదారులతో ముఖాముఖి మాట్లాడి వారి సమస్యలను శ్రద్ధగా విన్నారు. ప్రతి పిర్యాదును పరిగణనలోకి తీసుకుని, త్వరితగతిన, -మిగతా 2లో



## లక్ష్యసాధనలో వెనకడుగు వేయొద్దు

- కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్
- సివిల్స్ పరీక్షల ట్యాబ్‌ల పంపిణీ..

**నవతరం -శ్రీకాకుళం**

కష్టపడి చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని, లక్ష్యసాధనలో వెనకడుగు వేయవద్దని జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ విద్యార్థులకు పిలుపునిచ్చారు. రాష్ట్ర ఎస్సీ కార్పొరేషన్ సివిల్ సర్వీసెస్ శిక్షణ అభ్యర్థుల కోసం నిర్వహించిన రాత పరీక్షలో జిల్లా నుంచి ఎంపికైన ఇద్దరు అభ్యర్థులకు సోమవారం ఆయన ట్యాబ్‌లను అందజేశారు. స్థానిక జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో జరిగిన ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహమ్మద్ ఖాన్ తో కలిసి పలాసకు చెందిన ముడిదాన నీలకంఠం, జలుమూరు మండలం గొటివాడకు చెందిన నవి




చందులకు ఆన్‌లైన్ కోచింగ్, ప్రిలిమ్స్ మెటీరియల్‌తో కూడిన ట్యాబ్‌లను కలెక్టర్ చేతుల మీదుగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం అందిస్తున్న ఈ ప్రోత్సాహకాన్ని సద్వినియోగం చేసుకుని సివిల్స్‌లో విజయం సాధించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఎస్సీ కార్పొరేషన్ ఈడి వినాయకం రెడ్డి కూడా ఉన్నారు.

## లోక్ అదాలత్‌తో పెండింగ్ కేసులకు మోక్షం

**నవతరం -శ్రీకాకుళం**

వచ్చే మార్చి 14న జిల్లావ్యాప్తంగా నిర్వహించనున్న జాతీయ లోక్ అదాలత్‌ను కక్షిదారులు సద్వినియోగం చేసుకుని తమ సమస్యలను సామరస్యంగా పరిష్కరించుకోవాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ (డీఎల్ఎస్ఏ) కార్యదర్శి కె. హరిబాబు పిలుపునిచ్చారు. సోమవారం స్థానిక డీఎల్ఎస్ఏ కార్యాలయంలో బ్యాంక్ అధికారులు, ఇన్సూరెన్స్ కంపెనీల ప్రతినిధులు, ప్యానెల్ న్యాయవాదులతో ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. కోర్టుల్లో పెండింగ్‌లో ఉన్న సివిల్, రాజీపడదగ్గ క్రిమినల్ కేసులను ఉభయ పక్షాల అంగీకారంతో త్వరితగతిన పరిష్కరించుకోవచ్చని హరిబాబు సూచించారు. ముఖ్యంగా మోటారు వాహన ప్రమాద కేసుల్లో ఇన్సూరెన్స్ కంపెనీలు




సానుకూలంగా స్పందించి బాధితులకు సత్వర న్యాయం అందించాలని కోరారు. బ్యాంకు మొండి బకాయిలు, ప్రీ-లిటిగేషన్ కేసులను కూడా ఈ వేదిక ద్వారా పరిష్కరించుకోవడం వల్ల సమయం, నగదు ఆదా అవుతాయని స్పష్టం చేశారు. పరస్పర అంగీకారంతో కుదిరే ఈ రాజీ ద్వారా ఇరు పక్షాల మధ్య సత్సంబంధాలు నెలకొంటాయని ఆయన పేర్కొన్నారు.

## మహిళ శక్తికి ఘన వందనం
## మహిళా దినోత్సవ పోస్టర్ ఆవిష్కరణ

- ఎస్ఎస్ఆర్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో కార్యక్రమం
- మాజీ కేంద్రమంత్రి కిల్లి కృపారాణి చేతుల మీదుగా ఆవిష్కరణ
- మహిళే కుటుంబానికి బలం - కిల్లి కృపారాణి
- మహిళా సంక్షేమానికి ప్రత్యేక కృషి - డా. సూర శ్రీనివాసరావు
- మార్చి 8న మహిళలకు ఘన సన్మానాలు
- మహిళా సంఘ నాయకులు, ఎన్జీవో సభ్యుల పాల్గొనారు





**నవతరం -శ్రీకాకుళం**

శ్రీకాకుళం నగరంలోని జాబిలి రెస్టారెంట్ (ఎస్ఎస్ క్రిస్టల్ ప్యాలెస్) వద్ద సోమవారం అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఎస్ఎస్ఆర్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో మహిళా దినోత్సవ గోడపత్రికను మాజీ కేంద్రమంత్రి కిల్లి కృపారాణి ఆవిష్కరించారు.

ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళ ఉన్నచోటే ఆశయం ఉంటుందని, ఆమె ధైర్యమే కుటుంబానికి బలమని పేర్కొన్నారు. మహిళ ఎదుగుదల సమాజ అభివృద్ధికి దోహదమని, సహనం, సాహసం, సాధనకు మహిళ ప్రతీక అని భావోద్వేగంతో వివరించారు.

సమాజహితం కోసం పాటు పడుతూ మహిళా సంక్షేమానికి ప్రాధాన్యత ఇస్తున్న డా. సూర శ్రీనివాసరావు సేవలను ఆమె అభినందించారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా వివిధ రంగాల్లో సేవలందిస్తున్న మహిళలను ఘనంగా సన్మానించనున్నట్లు తెలిపారు.

ఎస్ఎస్ఆర్ చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకులు డా. సూర శ్రీనివాసరావు మాట్లాడుతూ మహిళలను యంత్రంలా కాకుండా మనకు జన్మనిచ్చిన భూదేవితో సమానంగా గౌరవించాలని అన్నారు.

మహిళా శక్తిని గౌరవించే ఉద్దేశంతోనే ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని, మహిళలకు తగిన గుర్తింపు తీసుకురావడం తన లక్ష్యమని పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో జ్యోతి, కొవ్వాడి సుశీల, పద్మ, హైమ, రాధా, రోజా, ఈశ్వరమ్మ, జేసీఐ ఉషారాణి, కుసుమ, జ్యోతిర్మయి, హారీషా, రమాసత్యవతి, ప్రియాంక, వెంకట్ లక్ష్మి, జయ్యమ్మ, రమా, శ్రీదేవి, న్యూ బ్లడ్ బ్యాంక్ మణికంఠ, సాయిబాబా, సాయి సంతోష్ తదితరులు, మహిళా సంఘ నాయకులు, ఎన్జీవో సభ్యులు పాల్గొన్నారు.

ఎడిటోరియల్

# ట్రంప్ బడా[యి] మాటలు!

అతిశయోక్తులు, అబద్దాలకు నిలువెత్తు ప్రతీక డోనాల్డ్ ట్రంప్. అతగాడి మీద వ్యక్తిగత కక్షతోనే, మరో కారణంగానో ఇలా చెప్పటం లేదు. మంగళవారం రాత్రి (మనకు బుధవారం) అమెరికా పార్లమెంటును ఉద్దేశించి నూతన సంవత్సర సందర్భంగా (ఏడాది ప్రారంభంలో మన రాష్ట్రపతి, గవర్నర్లు చేసే మాదిరి) చేసిన ప్రసంగంలో ప్రవచించిన అంశాలు అందుకు ఆస్కారమిచ్చాయి.

రెండవసారి అధికారానికి వచ్చిన ట్రంప్ తొలి ఏడాది పాలనాతీరును మూడింట రెండొంతుల మంది ఆమోదించటం లేదని ఒక వైపు సర్వేలు చెబుతుండగా వాటిని పూర్వపక్షం చేస్తూ తన పాలన అదరహో అన్నట్లు ఉందని ట్రంప్ గొప్పలు చెప్పుకున్నాడు. వెనుకటికెవడో ఇంటికి వచ్చిన వారి ముందు తన గొప్ప గురించి చెప్పరా అని సేవకుడికి చెబితే 'మా దొరగారి తోటలో మిరియాలు కొబ్బరికాయల్లా ఉంటాయి దొరా' అన్నాడట. మీరు గనుక జోక్యం చేసుకొని ఉండకపోతే భారత్-పాక్ మధ్య అణుయుద్ధం జరిగి మూడున్నర కోట్ల మంది జనం మరణించి ఉండేవారని పాకిస్తాన్ ప్రధాని షెహబాజ్ షరీఫ్ తనతో అన్నట్లు ట్రంప్ చెప్పుకున్నాడు. తన అవసరం రీత్యా పాక్ నేత నిజంగా అలానే అన్నాడేమో అని ఎవరైనా అనుకోవచ్చుగానీ ట్రంప్ చెప్పటమే విపరీతం.

మరికొన్నింటిని చూస్తే... అమెరికాలో నేరాల మీద తిరుగులేని విజయం, సరిహద్దుల రక్షణ,గృహనిర్వహణ ఖర్చు తగ్గింపు,ప్రపంచ వేదికలో అమెరికా ప్రతిష్టపెంపు....అంతేనా, అంతా మీరే చేశారన్న బొమ్మరిల్లు డైలాగ్ మాదిరి అంతా జోబైడెనే చేశాడంటూ గిడసబారిన ఆర్థిక స్థితిలో సంక్షోభంలో ఉన్న దేశం తనకు వారసత్వంగా వచ్చిందన్నాడు. ఎక్కడ చూసినా నేరాలు, యుద్ధాలు, గందరగోళం ఉన్న స్థితిలో పగ్గాలందుకున్న తాను పరిస్థితిని ఎన్నడూ, ఎవరూ చేయని రీతిలో, గతంలో ఎన్నడూ లేని విధంగా అమెరికాను పెద్దది, మెరుగైన, ధనవంతమైనదిగా మరోసారి మార్చాను అన్నాడు. ప్రపంచ చరిత్రలో గొప్పవాటిగా పరిగణించే మిలిటరీ చర్యలో ఒకటిగా వెనెజులా అధ్యక్షుడిని బందీచేశా. అమెరికాను చూసి ఇప్పుడు విరోధులు భయపడుతున్నారని చెప్పుకున్నాడు. గతంలో వియత్నాం నుంచి పారిపోయిన అమెరికన్లు మరోసారి అఫ్ఘనిస్తాన్‌లో అదే చేశారు. కట్టుబట్టలతో వెళ్లిపోతామంటూ తాలిబాన్‌లతో ప్రాధేయపడి ఒప్పందం చేసుకున్నది ఈ పెద్దమనిషే అన్నది దాస్తే దాగని సత్యం. మరోసారి దాడి చేస్తామని ప్రకటించి యుద్ధనౌకలను మోహరించటాన్ని చూసి నిజంగా భయపడితే రండి తేల్చుకుందాం అని ఇరాన్ అనగలదా?

అమెరికాను గొప్పగా చేయటం తరువాత సంగతి, మరోసారి దిగజారుస్తున్నారని అంటున్నట్లు సర్వేలు చెబుతుంటే, ఆర్థిక వ్యవస్థను పటిష్టపరుస్తున్నట్లు నమ్మించేందుకు ట్రంప్ ఈ ప్రసంగంలో పూనుకున్నాడు. తొలి ఏడాది జీడీపీలో 122శాతంతో 38లక్షల కోట్ల డాలర్లకు చేరిన అమెరికా అప్పు ఈ పెద్దమనిషి రెండవసారి పదవీకాలం పూర్తయ్యే నాటికి 2028లో 48లక్షల కోట్లకు చేరనుందని అంచనాలు వెలువడుతుంటే పటిష్టం చేశానని జనం చెవుల్లో పూలు పెడుతున్నాడు. ఆర్థిక వ్యవహారాల నిర్వహణ సరిగా లేదని 57శాతం, పన్నుల విధింపు సమర్థనీయం కాదని 64శాతం మంది జనం అభిప్రాయపడుతున్నట్లు తాజా సర్వేలు వెల్లడించాయి. అమెరికా చరిత్రలో ఏ అధ్యక్షుడి పాలనలోనూ జరగని విధంగా ఒక ఏడాది వ్యవధిలో సామాన్య అమెరికన్లు రెండు సార్లు లక్షలాది మంది అతగాడి పాలనా విధానాలకు వ్యతిరేకంగా వీధులకు ఎక్కటాన్ని దాస్తే దాగుతుందా?

గతేడాది కాలంగా చెబుతున్న అబద్దాలనే మరోసారి తాజా ప్రసంగంలో వల్లెవేసిన ట్రంప్ గోబెల్స్‌ను ఆదర్శంగా తీసుకున్నాడు. విదేశాల్లో అమెరికా పౌరులకు భద్రతను పెంచా, పశ్చిమార్ధగోళంలో అమెరికా ఆధిపత్యాన్ని స్థాపించా అన్నాడు. ఉక్రెయిన్ సంక్షోభాన్ని అధికారానికి వచ్చిన 24గంటల్లోనే నిలిపివేస్తానని ప్రగల్భాలు పలికాడు. అప్పు రేపు అని గోడమీద రాసినట్లుగా అదెప్పుడు పరిష్కారం అవుతుందో, ఎలా చేస్తాడో తెలియటంలేదు గాని యావత్‌లోకం నవ్వితే, 'ఎవరేమనుకుంటే నాకేటి సిగ్గ'న్నట్లుగా ఎనిమిది యుద్ధాలను నిలిపివేశా అన్నాడు. అమెరికా చరిత్రలో 108 నిమిషాల పాటు సుదీర్ఘ ప్రసంగం చేసి రికార్డు సృష్టించిన ట్రంప్ మన గురించి చెప్పకుండా ఉంటాడా!

అమెరికా వాణిజ్య ఒప్పంద చర్చలు వాయిదా వేసినట్లు మనదేశం చెప్పగా, తాను విధించిన పన్నులు చెల్లవని తీర్పు ఇచ్చినప్పటికీ అంతకు ముందు తనతో ఒప్పందాలు చేసుకున్న దేశాలన్నీ వాటికి కట్టుబడి ఉన్నాయన్నాడు. వాటితో తమదేశంలో ఉత్పత్తి రంగంలో 18లక్షల కోట్ల డాలర్ల పెట్టుబడులు వస్తాయని ట్రంప్ చెప్పాడు. అమెరికాతో చర్చలు వాయిదా అంటూ నరేంద్రమోడీ సర్కార్ జనాన్ని మభ్య పెడుతున్నదా? అన్న అనుమానం కలుగుతోంది. పన్నులను చూపి బెదిరించిన కారణంగా అనేక యుద్ధాలు (ఆపరేషన్ సింధూర్ గురించి అదే చెప్పాడు) నిలిచినట్లు చెప్పాడు. ఇప్పటికీ మనదేశాన్ని అమెరికా బ్లాక్‌మెయిలు చేస్తూనే ఉంది. దానిలో భాగంగానే మన దేశం నుంచి ఎగుమతి చేసే సోలార్ వస్తువులపై 125.87శాతం దిగుమతి పన్ను విధిస్తున్నట్లు అమెరికా చెప్పింది. ఇలాంటి దేశం గురించి మన నేతలు భ్రమలు పెట్టుకున్నారా? లొంగిపోతారో చూద్దాం!

# ఎచ్చెర్లలో 3న జాబ్ మేళా

నవతరం -ఎచ్చెర్ల



బెంగళూరుకు చెందిన ఉన్నతి ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 3వ తేదీన ఎచ్చెర్లలోని ఎన్టీఆర్ మహిళా ప్రాంగణంలో జాబ్ మేళా నిర్వహించనున్నట్లు ఆ సంస్థ ప్రతినిధి బి. రంజిత్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. అర్హత గల అభ్యర్థులు ఉదయం 10 గంటలకు సంబంధిత ధృవపత్రాలతో హాజరు కావాలని కోరారు. ఉద్యోగావకాశాల కోసం యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

# జూనియర్ రెడ్ క్రాస్ అద్భుతం సృష్టించారు

## న్యూ సెంట్రల్ పాఠశాల డైరెక్టర్ పి.శ్రీకాంత్




నవతరం- శ్రీకాకుళం

న్యూ సెంట్రల్ పాఠశాల జూనియర్ రెడ్ క్రాస్ విద్యార్థులు అద్భుతం సృష్టించారని, న్యూ సెంట్రల్ పాఠశాల డైరెక్టర్ పి.శ్రీకాంత్, ప్రధానాచార్యులు, విస్రాంత విద్యాశాఖాధికారి బలివాడ.మల్లేశ్వర రావు, ఇండియన్ రెడ్ క్రాస్ చైర్మన్ పి.జగన్ మోహన్ రావు అన్నారు. స్థానిక పిఎన్ కోలనీలో గల న్యూ సెంట్రల్ పాఠశాల విద్యార్థులు, తల్లితండ్రులు హయాంలో మేఘా రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. ఇందులో భాగముగా పాఠశాల డైరెక్టర్ పి.శ్రీకాంత్ మాట్లాడుతూ జూనియర్ రెడ్ క్రాస్ విద్యార్థులు అనుకున్న దానికన్నా ఎక్కువమంది రక్తదాతలు, స్వచ్ఛంద సంస్థలు, ప్రముఖులు, వక్తలు, తల్లితండ్రులు పాల్గొని స్వచ్ఛందంగా రక్తదానం చేశారని, ప్రతీ రక్తపు బొట్టునీ తలసీమియా పిల్లలకు, దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న వ్యాధిగ్రస్తుల పిల్లలకు ఉచితంగా అందిస్తామని ఈ సందర్భంగా పేర్కొన్నారు. గత 8 సంవత్సరాలుగా నిర్వహిస్తున్న ఈ మహోత్తర కార్యక్రమాన్ని అందరూ విజయవంతం చేశారని, ఇంతకుమిచ్చిన సంతోషం ఇంకేముందని, ముఖ్యంగా విద్యార్థులకు సామాజిక సేవారంగంలో అభిరుచిని, అవసరాన్ని తెలియజేయాలన్నదే మా ముఖ్య ఉద్దేశ్యమన్నారు. రానున్న రోజులలో మా విద్యార్థులు అనేక సేవా కార్యక్రమాలతో మీ ముందుకు వస్తారని, జూనియర్ రెడ్ క్రాస్ ద్వారా నిస్వార్ధ సేవలతో మీ ముందుకు వస్తామన్నారు. మొత్తం 3 వందలు పైగా రక్తదాతలు పాల్గొనగా, పరీక్షల అనంతరం 215 యూనిట్లకు చేరువయ్యామని రెడ్ క్రాస్ చైర్మన్ పి.జగన్ మోహన రావు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు బలివాడ.మల్లేశ్వర రావు తెలిపారు. ఇంతటి ఘన విజయాన్ని అందించిన రక్తదాతలకు, శ్రేయోభిలాషులకు, రెడ్ క్రాస్ బృందానికి పాఠశాల యాజమాన్యం తరపున డైరెక్టర్స్ పి రమా కుమారి, పి.శ్రీదేవి, పివిఆర్ఎం పట్నాయక్, కె. సోమ సుందర్రావు, రెడ్ క్రాస్ కార్యదర్శి, కొనుగల దుర్గ. శ్రీనివాసరావు, పి.వైకుంఠరావు, నిక్కు.అప్పన్న, ఎం కళ్యాణ్ చక్రవర్తి కృతజ్ఞతలు తెలియజేసారు.

ఈ కార్యక్రమంలో రెడ్ క్రాస్ ప్రతినిధులు కె.సత్యనారాయణ, పి.చైతన్యన కుమార్, జి. రమణ, బి. సతీష్ కుమార్, సామాజిక సేవకులు ఉర్లం.శివతేజ, పాఠశాల బోధన, బోధన ఇతర సిబ్బంది, విద్యార్థులు విద్యార్థులు తల్లిదండ్రులు రక్తదాతలు తదితరులు పాల్గొన్నారు.

# సాగునీటి సమస్యలను పరిష్కరించాలి

## వంశధార ప్రాజెక్ట్ కమిటీ చైర్మన్ అరవల రవీంద్ర

నవతరం- శ్రీకాకుళం



బి.ఆర్.ఆర్.వంశధార ప్రాజెక్టు, శ్రీకాకుళం పరిధిలోని నీటి వినియోగదారుల సంఘాలు మరియు డిస్ట్రిబ్యూటరీ కమిటీల సమావేశం సోమవారం నాడు జరిగింది.

బి.ఆర్.ఆర్.వంశధార ప్రాజెక్టు పర్యవేక్షక ఇంజనీరు రామచంద్రరావు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ప్రాజెక్ట్ కమిటీ చైర్మన్ అరవల రవీంద్ర పాల్గొన్నారు. ఈ సందర్భంగా పలు కీలక అంశాలను తీర్మానంలో చేర్చారు. ప్రత్యేక పరిశోధనా విభాగం, శ్రీకాకుళం కార్యాలయంలో ప్రాజెక్టు కమిటీ చైర్మన్ కు వసతి కల్పించాలని, నీటి వినియోగదారుల సంఘాలు మరియు డిస్ట్రిబ్యూటరీ కమిటీల ఆధ్వర్యంలో చేపట్టిన పనులకు జీఎస్టీ మినహాయింపు మంజూరు చేయాలని కోరారు. కాలువలలో గుర్రపు డెక్క తొలగింపు మరియు కాలువల గండ్లను తక్షణమే మూసివేయడానికి ముందస్తు పరిపాలనా అనుమతి మంజూరు చేయాలని జిల్లా అధికారులకు ప్రతిపాదించారు. నీటి పన్ను వసూళ్లను రెవెన్యూ శాఖ ద్వారా సమర్థవంతంగా వసూలు చేయడానికి ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు తగిన చర్యలు తీసుకోవాలని, ఈ విషయంలో రెవెన్యూ అధికారులకు మార్గదర్శకాలు జారీ చేయడానికి జిల్లా కలెక్టర్ ని పర్యవేక్షక ఇంజనీర్ లేఖ ద్వారా సంప్రదించాలని కోరారు. కాలువ గేట్ల మరమత్తులు తక్షణమే చేపట్టాలని, నీటి సరఫరా మరియు కాలువల నిర్వహణ ఏడాది పొడవునా నిరాటంకంగా సాగేందుకు శాశ్వత మరియు అవుట్సోర్సింగ్ లస్కర్ల నియామకానికి అనుమతుల కోసం పై అధికారులను సంప్రదించాలని పర్యవేక్షక ఇంజనీర్ ను కోరారు. గొట్టా బ్యారేజ్ వార్షిక నిర్వహణ పనులకు నిధులు తక్షణమే విడుదల చేయాలని, ఎరగాం, పురుషోత్తపురం, బైరి ఓపెన్ హెడ్ ఛానల్స్ ఆధునీకరణ పనులు తక్షణమే చేపట్టాలని అభ్యర్థించారు. ఎడమ ప్రధాన కాలువ ఆధునీకరణ పనులు చేపట్టి సామర్థ్యాన్ని పెంచాలని, వయాడక్ట్ డ్రిఫ్టింగ్ పనులకు అనుమతులు తీసుకుని చేపట్టాలని కోరారు. కుడి ప్రధాన కాలువ డిస్ట్రిబ్యూటరీలు మరియు ఫీల్డ్ ఛానల్స్ మరమ్మతులు చేపట్టి నీటి పంపిణీ వ్యవస్థను మెరుగుపరచాలని, దుర్బల ప్రాంతాల్లో సీసీ లైనింగ్ పనులు అత్యవసరంగా చేపట్టాలని అభ్యర్థించారు. చెరువులు, రిజర్వాయర్ పరిధిలో ఫిషరీస్ డిపార్ట్మెంట్ చేపలు వేసినప్పుడు నీటి పారుదల శాఖను సంప్రదించి, వచ్చిన రెవెన్యూలో వాటాను ఇవ్వాలని కోరారు. ఈ తీర్మానాల అమలు ద్వారా ప్రాజెక్టు ప్రాంతంలో నీటి సరఫరా మరియు కాలువల నిర్వహణ మరింత సమర్థవంతంగా సాగుతుందని సమావేశంలో పాల్గొన్న సకలం నీటి వినియోగదారులు ఆశాభావం వ్యక్తం చేశారు.

# వినూత్నంగా వినతులను స్వీకరించిన కేంద్ర మంత్రి

నవతరం -శ్రీకాకుళం

కేంద్ర పౌరవిమానయన శాఖ మంత్రి, శ్రీకాకుళం పార్లమెంట్ సభ్యులు కింజరాపు రామ్మోహన్ నాయుడు.. సోమవారం నాడు వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. సామాన్య ప్రజల సమస్యల పరిష్కారానికి మరింత చొరవ చూపేవిధంగా వర్చువల్ విధానంలో ఆన్లైన్ గ్రీవెన్స్ కార్యక్రమాన్ని చేపట్టారు. సోమవారం నాడు శ్రీకాకుళం నగరం ఎనబై అడుగుల రహదారిలోని క్యాంప్ కార్యాలయం నుండి జిల్లా ప్రజలు వినతులు అందించగా.. డిల్లీలోని తన కార్యాలయం నుండి రామ్మోహన్ నాయుడు వినతులను స్వీకరించారు. వర్చువల్ విధానంలో బాధితులతో మాట్లాడుతూ.. ఓపికగా వారి సమస్యను తెలుసుకుంటూ.. అక్కడికక్కడే సంబంధిత అధికారులకు సమస్యను చేరవేస్తూ పరిష్కారానికి ఆదేశించారు. మొత్తంగా ఉదయం 10:30 గంటలకు ఈ ఆన్లైన్ గ్రీవెన్స్ కార్యక్రమం ప్రారంభం కాగా.. మధ్యాహ్నం 12:30 వరకు కొనసాగింది. మొత్తంగా 56 మందితో రామ్మోహన్ నాయుడు నేరుగా మాట్లాడి..

వారి సమస్యలను ఒడ్డుకు చేర్చారు. కేంద్ర మంత్రి స్థాయిలో నిత్యం హస్తినలో క్షణం తీరిక లేకుండా గడిపే రామ్మోహన్ నాయుడు.. తాజా కార్యక్రమం ఆన్లైన్ గ్రీవెన్స్ ద్వారా.. ప్రజా సమస్యలను మరింత వేగవంతమైన పరిష్కారం దొరుకుతుందని జిల్లా వాసులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఇకపై ఈ ఆన్లైన్ గ్రీవెన్స్ కార్యక్రమం మరింత విస్తృతం చేస్తామని, పార్లమెంట్ నియోజకవర్గ కేంద్రంతో పాటు, ఏడు నియోజకవర్గాల్లోని శాసనసభ నియోజకవర్గ కేంద్రాలలో సైతం గ్రీవెన్స్ అందుకునే ఏర్పాటు చేస్తామని తెలిపారు. సామాన్య ప్రజల సమస్యలను మరింత ప్రాధాన్యం ఇస్తూ.. వేగవంతమైన చర్యలకు కార్యాచరణ సిద్ధం చేశామని రామ్మోహన్ నాయుడు తెలిపారు.

# ప్రజా పిర్యాదులను పూర్తి స్థాయిలో పరిష్కారం చూపాలి

మొదటిపేజీ తరువాయి

న్యాయపరంగా పరిష్కారం చూపేలా చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.జిల్లా ఎస్పీ మాట్లాడుతూ,..ప్రజల సమస్యల పరిష్కారమే మొదటి ప్రాధాన్యత గా బావించి,పబ్లిక్ గ్రీవెన్స్‌లో వచ్చిన ప్రతి పిర్యాదును క్షుణ్ణంగా పరిశీలించి, బాధితులకు న్యాయం జరిగేలా పూర్తి స్థాయిలో పరిష్కారం చూపాలి" అని స్పష్టం చేశారు.అలాగే, పిర్యాదుల పరిష్కారంలో అలసత్వం, నిర్లక్ష్యం సహించబోమని, నిర్ణీత గడువులో విచారణ పూర్తి చేసి నివేదిక సమర్పించాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో భూ సమస్యలు, ఆస్తి తగాదాలు, కొట్లాటలు,వ్యక్తిగత తగాదాలు, మోసపూరిత మైన పిర్యాదులు,కుటుంబ సమస్యలు వంటి పిర్యాదులు స్వీకరించడం జరిగింది .

## తెలుగు సంప్రదాయ శోభ

# ధోతి – కండువా.....!



సనాతన
సంప్రదాయమూర్తులారా
!
సంప్రదాయ సనాతన
ధర్మ పరిరక్షకులారా !!

సంప్రదాయ శోభతో
నిలిచిన ఈ వేళ,
ధోతి కండువాలతో
నేనొక భావగీతం లాంటి
వేళ.
మన సంస్కృతి మన
సిరి,
మన పరంపర మన
వెలుగు,
మన విలువలు మనకు
నిత్య నూతన మెరుగు.

ధోతి కేవలం వస్త్రమా?
కాదు
అది మూలాల జ్ఞాపకం,
పూర్వీకుల పథం చూపే
పవిత్రమైన దీపకం.
కండువా కేవలం
అంగవస్త్రమా?
కాదు అది గౌరవ గాథ,
మర్యాదకు ముద్ర వేసే
మన సంస్కృతి సౌధ.

సత్యం,ధర్మం, సేవ,
సన్మార్గమే
మన దృఢమైన స్తంభాలు,
వాటిపైనే నిలుస్తాయి
సమాజపు అద్భుత
గోపురాలు.
ఆధునికతతో అడుగులు
వేస్తూ
ముందుకు సాగుదాం,
సంప్రదాయ సౌరభాన్ని
హృదయంలో
నిలుపుదాం.

యువతరం విలువలను
తెలుసుకుని ఆచరించాలి,
తరతరాలకు ఈ
సంస్కృతి
వెలుగును అందించాలి.
కుటుంబం బలమైతే
సమాజం
బలమవుతుంది,
సమాజం బలమైతే
దేశం
శక్తిమంతమవుతుంది.

కలిసికట్టుగా సన్మార్గంలో
సాగుదాం,
సేవా భావంతో
భారతాన్ని
శ్రేష్ఠంగా తీర్చిదిద్దుదాం.
మన సంస్కృతే మన
గర్వం,
మన గీతం, మన
ప్రాణం–
భారతమాతకు ఇదే మన
వందనం.



తేరాల రాజేంద్రప్రసాద్ గుప్తా
రత్నలహరి ఛానల్, సీఈవో
9297109223, సికింద్రాబాద్

# 6000 సంవత్సరాల వరమూర్తీశ్వరర్ పురాతన ఆలయం – తమిళనాడు

వరమూర్తీశ్వరర్ అరియతురైలో తిరువల్లూర్ జిల్లాలో ఉంది. ఇది శివునికి అంకితం చేయబడిన ఆలయం.ప్రధాన దేవత శివుడుని రోమర్ అనే ఋషి ప్రతిష్టించాడని, తరువాత ముకుంద అనే ఋషి ఇక్కడ 100 సంవత్సరాలు పూజించాడని నమ్ముతారు. ఈ ఆలయం సుమారు 6000 సంవత్సరాల క్రితం రామాయణ కాలం నాటిదిగా పరిగణించబడుతుంది. వర ముర్తేశ్వరుడు తూర్పుముఖంగా , దక్షిణ వైపు తిరిగి మరకతవల్లి ఉంటుంది.అరియతురైలోని వరమూర్తీశ్వరర్ అనాదిగా గౌరవించబడుతున్న ప్రార్థనా స్థలం. ఇది అధికమైనభక్తులతో నూతన భక్తిని ప్రేరేపిస్తూనే ఉంటుంది. ప్రశాంతమైన వాతావరణంలో చుట్టుముట్టబడి సాంస్కృతిక ఆకర్షణతో సమృద్ధిగా ఉన్న ఈ ఆలయం విశ్వాసం, సంప్రదాయం, సమాజ బంధానికి చిహ్నంగా నిలుస్తుంది దీని పవిత్ర ప్రాంగణం తరతరాలుగా ప్రార్థనలు పండుగలు ఆచారాలకు సాక్ష్యంగా నిలిచింది.ఇవి ఈ ప్రాంతపు యొక్క ఆధ్యాత్మిక హృదయ స్పందనను ప్రతిబింబిస్తాయి. సందర్శకులు ఆలయ దైవిక దేనికి మాత్రమే కాకుండా దాని అందమైన పరిసరాలు సంక్లిష్టమైన హస్తకళ మరియు అది అందించే శాంతి భావనకు కూడా ఆకర్షితులవుతారు.

వరమూర్తీశ్వరర్ అరియతురై అనేది తూర్పు ముఖంగా ఉన్న ఒక పెద్ద ఆలయం, దక్షిణం నుండి ప్రవేశ ద్వారం ఉంది. ప్రవేశ ద్వారానికి దక్షిణంగా కొంచెం దూరంలో ఒక ఆలయ చెరువు కనిపిస్తుంది. ఆలయానికి సమీపంలో నైరుతి దిశలో బ్రహ్మారణ్య (ఆరని) నది ప్రవహిస్తుంది. రెండు ప్రధాన దేవతలు ఆకుపచ్చ రాయితో తయారు చేయబడ్డాయి. ఈ ఆలయంలో 32 గోష్టములు, గర్భగుడి బయటి ప్రాకారంలో గూళ్లు ఉండటం ప్రత్యేకత, అయితే వాటిలో కొన్నింటిలో మాత్రమే దేవతలు ఉన్నారు. దీనిని ఉత్తమ పచ్చ ప్రతిష్టి అని పిలుస్తారు మరియు తమిళనాడులో దాదాపు 15 దేవాలయాలు మాత్రమే ఈ విధంగా ఉన్నాయని చెబుతారు.

ఇటీవలి కాలంలో ఈ ఆలయాన్ని రంగులు చేసి అలంకరించారు. ఇక్కడ నవగ్రహాలు లేవు. గర్భగుడి పైకప్పు పైభాగంలో పాములు, బల్లులు, కప్పలు మరియు చేపల చిత్రాలు చెక్కబడ్డాయి. వరమూర్తీశ్వరర్ అరియతురై వద్ద ఇసుకతో చేసిన స్వయంభు భైరవుడు మరియు ఒక విగ్రహం కనిపిస్తుంది.



శివుని సత్యోజాతం ముఖాన్ని సూచించే పంచనాథ (శివుని ఐదు ముఖాలు) క్షేత్రాలలో వరమూర్తేశ్వరర్ అరియతురై ఒకటి. మిగిలినవి రామగిరిలోని వాలీశ్వరుడు (ఈశానం), సురుట్టుపల్లిలోని పల్లికొండేశ్వరుడు (తత్పురుషం), ఆరణిలోని పిచ్చండేశ్వరుడు (వామదేవుడు), కరుణాళిలోని చింతామనీశ్వరుడు (అఘోరం). ఐదు పంచ బ్రహ్మ ప్రదేశాలలో ఒకటి.

వరమూర్తీశ్వరర్ని రోమార్ అనే ఋషి ప్రతిష్టించాడని తరువాత ముకుంద మహర్షి ఇక్కడ 100 సంవత్సరాలు పూజించాడని నమ్ముతారు. ఈ ఆలయం సుమారు 6000 సంవత్సరాల క్రితం రామాయణ కాలం నాటిదిగా పరిగణించబడుతుంది, ఇది రోమర్ మరియు ముకుందన్ అనే ఋషులతో ఉన్న పురాణ సంబంధాన్ని పరిగణనలోకి తీసుకుంటుంది. నది ఒడ్డున ఒక గొయ్యి ఉంది, దాని నుండి గంగా నది నుండి వచ్చిన నీరు తక్కువ పరిమాణంలో ఉన్నప్పటికీ శాశ్వతంగా ప్రవహిస్తుంది. అందువల్ల ఈ ప్రదేశం కాశీ కంటే పవిత్రంగా పరిగణించబడుతుంది.ఈ నీటి బుగ్గకు కథ ఉంది.

శ్రీకృష్ణుడు తన భార్యలైన సత్యభామ మరియు రుక్మిణికి పువ్వులు అందించడానికి దైవిక ప్రపంచం నుండి పారిజాత వృక్షాన్ని తీసుకువచ్చాడు. చెట్టును తీసుకురావడానికి ముందు అతను చెట్టు నుండి అనుమతి అడగడం మర్చిపోయాడు మరియు అది అతన్ని ఈ ప్రదేశంలో 1000 సంవత్సరాలు భూమిపై చెట్టుగా నిలబడమని శపించింది. శాప కాలం తర్వాత ఆ చెట్టు అశ్వథ వృక్షంగా మారింది. రోమాసర్ మరియు ముకుంద మహర్షి ఒకే చెట్టు కింద తపస్సు చేశారు. ముని ముకుందుడు కాశీకి బయలుదేరాలనుకున్నప్పుడు గంగా జలం ఇక్కడే ప్రవహిస్తుందని ఒక పవిత్ర వాణి ప్రకటించినట్లు నమ్ముతారు. వరమూర్తీశ్వరర్ అరియతురై ఆలయం దాదాపు 6000 సంవత్సరాల పురాతనమైనదిగా పరిగణించబడుతుంది మరియు అప్పట్లో నవగ్రహ పూజలు ఆచరించబడలేదు కాబట్టి ఇక్కడ నవగ్రహాలు లేవు. ఆలయ సమీపంలో ఉన్న శాశ్వత నేటి బుగ్గ గంగా నది యొక్క అభివ్యక్తిగా నమ్ముతారు.

**ఈ ఆలయాన్ని ఇలా చేరుకోవాలి :**

వరమూర్తీశ్వరర్ అరియతురై చెన్నై-కోల్కత్తా హైవేలో గుమ్మిడిపూండికి వెళ్ళే మార్గంలో కవరపేటై సమీపంలో పాడి జంక్షన్ నుండి సరిగ్గా 36 కిలోమీటర్ల దూరంలో ఉంది. థాచూర్ క్రాస్ రోడ్ తర్వాత (పొన్నేరికి), ఆర్. ఎం. కే.ఇంజనీరింగ్ కళాశాల ముందు, పెట్రోల్ బంక్ ఎదురుగా మరియు దుర్గా దేవి పాలిటెక్నిక్ ఎదురుగా మీరు ఎడమ వైపుకు (పశ్చిమ వైపు) మలుపు తీసుకోవాలి. మీరు 2.6 కిలోమీటర్లు నేరుగా వెళ్లి, కుడి వైపున ఉన్న ఇటుక బట్టీ తర్వాత మళ్ళీ ఎడమ వైపు మలుపు తీసుకోవాలి. మరో 500 మీటర్లు ముందుకు వెళితే మీరు వరమూర్తీశ్వరర్ అరియతురై చేరుకుంటారు.

వ్యాసకర్త
ఆధ్యాత్మిక సాహిత్య వ్యాసభూషణ్,
ఆధ్యాత్మక సాహిత్య సామ్రాట్
కావ్యసుధ,
హైదరాబాద్,
సెల్ 92473 13488





# ఈ హీరోది మిడిల్ క్లాస్ మైండ్ సెట్

హీరోలు రిచ్ లైఫ్ మెయింటైన్ చేస్తారు. దుస్తులు, యాక్సరీస్, వాహనాలు చాలా రిచ్ గా ఉంటాయి. ఏమాత్రం టైమ్ దొరికినా విదేశాల్లో విహరిస్తుంటారు. నటుడు మాధవన్ మాత్రం దీనికి అతీతం. తనది మిడిల్ క్లాస్ మెంటాలటీ అంటున్నాడు.

వంద కోట్ల రూపాయలకు పైగా ఆస్తులు ఉన్నప్పటికీ, అధికంగా ఏదైనా ఖర్చు చేస్తే చాలా గిల్టీ ఫీలవుతానని అంటున్నాడు మాధవన్. 'మనకు అవసరమా..' అనే ఫీలింగ్ కలుగుతుందంట. నిజానికి ఈ మిడిల్ క్లాస్ ఫీలింగ్ తో ఉండడం వల్లనే ఆర్థికంగా సురక్షితమైన స్థానంలో ఉన్నానని చెబుతున్నాడు ఈ నటుడు. "నేను డబ్బు ఖర్చు చేసినప్పుడు నాకు ఒక రకమైన అపరాధ భావన కలుగుతుంది. ఇది నాకు సరియైనదేనా అని అనుకుంటాను. ఇప్పటికీ అదే వైఖరిని కొనసాగిస్తున్నాను. ఆ వైఖరే నాకు ఉపయోగపడింది" అంటున్నాడు మాధవన్. ధైర్యంగా రిస్కలు తీసుకునే కొంతమంది వ్యక్తులు ఇంకా ఎక్కువ అదృష్టాన్ని పొందుతారని, అయితే తను మాత్రం ఆర్థికంగా అలాంటి రిస్కులు తీసుకోలేనని వెల్లడించాడు. మరి తను సంపాదించిన డబ్బును మాధవన్ ఏం చేస్తాడు? ఈ విషయంలో మాధవన్ రియల్ ఎస్టేట్ రంగాన్ని నమ్ముకున్నాడు. దశాబ్దాలుగా రియల్ ఎస్టేట్ రంగాన్ని చూస్తున్నానని, ఆ ఫీల్డ్ అలా వృద్ధి చెందుతూనే ఉంది తప్ప ఎప్పుడు పడిపోలేదని, అందుకే తను రియల్ ఎస్టేట్ రంగంలో పెట్టుబడులు పెడతానని వెల్లడించాడు మాధవన్. ధురంధర్ తో సరికొత్త మేకోవర్ అందుకున్న ఈ నటుడు, తన మనసుకు నచ్చిన పాత్రలు మాత్రమే చేస్తానని అంటున్నాడు.

# 2 నెలల ముందే డబ్బింగ్ వర్క్ మొదలు

సాధారణంగా పెద్ద సినిమాలకు ఆఖరి నిమిషంలో డబ్బింగ్స్ జరుగుతుంటాయి. మరీ ముఖ్యంగా హీరో డబ్బింగ్ చివరాఖరుకు జరుగుతుంది. ఇలా లాస్ట్ మినిట్ వరకు డబ్బింగ్ ఆపడం వెనక ఒక్కో హీరోకు ఒక్కో రీజన్ ఉంటుంది. పెద్ది విషయంలో మాత్రం ఇలా జరగలేదు.

ఈనెల 27న రిలీజ్ అవ్వాల్సిన ఈ సినిమా వచ్చేనెల 30కి వాయిదా పడిన సంగతి తెలిసిందే. ఈరోజు రామ్ చరణ్ డబ్బింగ్ వర్క్ స్టార్ట్ చేశాడు. అంటే దాదాపు 2 నెలల ముందే పెద్ది డబ్బింగ్ మొదలైందన్నమాట. మరోసారి మూవీ పోస్ట్ పోన్ అవుతుందంటూ అక్కడక్కడ జరుగుతున్న ప్రచారానికి దీంతో తెరపడినట్టయింది.

డబ్బింగ్ కు సంబంధించి చిన్న వీడియో కూడా రిలీజ్ చేశారు. అందులో చరణ్-బుచ్చిబాబు మధ్య అనుబంధం తెలుస్తోంది. చికిరి చికిరి సాంగ్ కు సంబంధించి బుచ్చిబాబును చరణ్ ఏడిపిస్తున్న సన్నివేశం ఆ వీడియోలో ఉంది. చరణ్, జాన్వి హీరోహీరోయిన్లుగా నటిస్తున్న ఈ సినిమాకు ఏఆర్ రెహ్మాన్ సంగీతం అందిస్తున్నారు. ఇప్పటికే చికిరి సాంగ్ పెద్ద హిట్టయింది. సెకెండ్ సింగిల్ కోసం అంతా వెయిటింగ్.



# బిఎస్ సి ఫెస్ట్ ఆక్షి 2కె 26 పోస్టర్ ఆవిష్కరణ



**నవతరం- శ్రీకాకుళం**

నగరంలోని ఎల్ ఈ సి కార్యాలయం ప్రక్కన ఉన్న కాకినాడ ఆదిత్య మహిళా డిగ్రీ కళాశాలలో మార్చి 14వ తేదీన బిఎస్ సి ఆధ్వర్యంలో జరగబోయే కంప్యూటర్ సైన్స్ ఆక్షి 2కె26 కు సంబందించిన పోస్టర్ ను కళాశాల డైరెక్టర్ బిఎస్ చక్రవర్తి, ప్రిన్సిపాల్ కె శివ శంకర్ ఆవిష్కరించి అనంతరం మాట్లాడుతూ తమ కళాశాల విద్యతో పాటు విద్యార్థుల సృజనాత్మికతలను వెలికి తీసే ఇలాంటి కార్యక్రమాలను కూడా నిర్వహిస్తుందని కాబట్టి విద్యార్థులందరూ ఫెస్టులలో నిర్వహించే వివిధ పోటీలలో పాల్గొనాలని కోరేరు, కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ కె వేణు, కంప్యూటర్ విభాగాధిపతి ప్రసాద రావు, కంప్యూటర్ విభాగ అధ్యాపకులు, విద్యార్థినిలు పాల్గొన్నారు.

# “విశిష్ట సేవలందించే వారికే సమాజంలో సముచిత స్థానం”



**నవతరం-విశాఖపట్నం**

విశిష్ట సేవలందించే ఉద్యోగులకు సమాజంలో సముచిత స్థానం ఉంటుందని స్థానిక తూర్పు కోస్తా రైల్వే డీజిల్ లోకో షెడ్ ఎ.డి.ఎం.ఇ శశిధర్ పేర్కొన్నారు. సీనియర్ టెక్నీషియన్ కుప్పిలి గిరిధర్ పట్నాయక్ పదవీ విరమణ చేసిన సందర్భంగా ఇక్కడి ఓ ప్రైవేట్ ఫంక్షన్ హాల్లో ఏర్పాటైన వీడ్కోలు సత్కార సభలో ఎ.డి.ఎం.ఇ ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. సెక్షన్ ఇంజనీర్ రామదాసు,లోకో ఫోర్ మేన్ పవన్ కుమార్, సిబ్బంది ఉద్యోగ విరమణ చేసిన గిరిధర్ పట్నాయక్ 38 ఏళ్ల పాటు అందించిన సేవలు మరువలేనివని అన్నారు.ఆయనను ఘనంగా సత్కరించారు. విశ్రాంత గెజిటెడ్ ప్రధానోపాధ్యాయులు, ప్రముఖ రచయిత మునగవలస సత్యనారాయణ (శ్రీకాకుళం) సన్మాన పత్రాన్ని చదివి సమర్పించారు.

# 255 మంది విద్యార్థులకు పరీక్ష సామాగ్రి పంపిణీ



**నవతరం-టెక్కలి**

టెక్కలి మండలంలో బూరగాం, నందిగాం మండలంలో లఖిదాసపురం, నర్సిపురం, దేవళభద్ర, నందిగాం, పెద్దతామరాపల్లి, నౌగాం, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో, నందిగాం డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ బాలికల గురుకుల పాఠశాలలో అభయం యువజన సేవా సంఘం ఆధ్వర్యంలో 10వ తరగతి పరీక్షలకు హాజరవుతున్న 255 మంది విద్యార్థులకు ఆల్ ది బెస్ట్ చెబుతూ ప్రతి విద్యార్థికి ప్లాంక్,పెన్, పెన్సిల్ పంపిణీ కార్యక్రమం చేసినట్లు అభయం యువజన సేవా సంఘం అధ్యక్షులు దేవాది శ్రీనివాసరావు తెలియజేశారు. టెక్కలి పరిధిలో ఉన్న ప్రభుత్వ పాఠశాల లో సుమారు1500 మందికి స్టేషనరీ పంపిణీ చేయనున్నట్లు ఆయన తెలియజేశారు. మా అభయం యువజన సేవా సంఘం పై నమ్మకంతో ఈ కార్యక్రమానికి ఆర్థిక సహాయం అందించిన దాతలందరికీ అభయం యువజన సేవా సంఘం తరపున ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో అభయం సేవా సంఘ అధ్యక్షుడు దేవాది శ్రీనివాసరావు, సంఘ సభ్యులు ధర్మవరపు పూర్ణాచారి, యన్ సింహాచలం, అద్దాల వీరభద్రాచారి పాల్గొన్నారు.

## శ్రీ చైతన్య స్కూల్‌లో అత్యంత ఘనంగా జరిగిన

# జాతీయ సైన్స్ దినోత్సవ వేడుకలు

**నవతరం- శ్రీకాకుళం**




స్థానిక మహాలక్ష్మీ నగర్ కోలనీ, శ్రీకాకుళం పట్టణంలో ఉన్న శ్రీచైతన్య టెక్నో స్కూల్ లో పాఠశాల ప్రిన్సిపాల్ ఆర్.రాంప్రసాద్ మరియు బి.శ్రీనివాస రావు అధ్యక్షతన ప్రపంచ ప్రఖ్యాత భారతీయ భౌతిక శాస్త్రవేత్త మరియు భౌతిక శాస్త్రంలో మొదటి నోబెల్ బహుమతి గ్రహీత అయిన కీ.శే. సర్.సి.వి.రామన్ “రామన్ ఎఫెక్ట్” ను కనుక్కొన్న సందర్భంగా దేశ వ్యాప్తంగా జాతీయ సైన్స్ దినోత్సవ వేడుకలను జరుపుకొన్న విధంగా మా పాఠశాలలో కూడా అత్యంత ఘనంగా జరుపుకొన్నామని తెలియ జేశారు.

ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా శ్రీకాకుళం జిల్లా స్థానిక ఎమ్మెల్యే గౌరవనీయులైన గొశీడు శంకర్ మరియు విశిష్ట అతిథిగా ఉత్తరాంధ్ర జిల్లాల ఎగ్జిక్యూటివ్ ఎ. జి.ఎం ఎం.వి.సురేష్ విచ్చేశారు. ముందుగా ముఖ్య అతిథి, విశిష్ట అతిథి మరియు శ్రీకాకుళం జిల్లా శ్రీ చైతన్య పాఠశాలల రీజియన్ ఇంచార్జి ఎస్.రామి నాయుడు, కో ఆర్డినేటర్ ఎ.బాల రాజు, అకడమిక్ డీన్ పి.కోటేశ్వర రావు, వైస్ ప్రిన్సిపాల్ పి.లోకనాథ రావు తదితరులు సర్ సి.వి.రామన్ చిత్ర పటానికి పూలమాలలు వేసి జ్యోతీ ప్రజ్వలన చేశారు.

ముఖ్య అతిథిగా విచ్చేసిన స్థానిక గౌరవనీయులైన ఎం.ఎల్.ఎ.గొశీడు శంకర్ విద్యార్థినీ విద్యార్థులను ఉద్దేశిస్తూ, ముందుగా విద్యార్థినీ విద్యార్థులందరికీ జాతీయ సైన్స్ దినోత్సవ శుభాకాంక్షలను తెలియ జేశారు. “విద్యార్థులంతా నేడు నైపుణ్యాలను, సామర్థ్యాలను అత్యంత సమర్థవంతంగా మెరుగుపరచుకొంటూ ముందుకు సాగాలని, అప్పుడే మన రాష్ట్రం సుసంపన్న వికసిత రాష్ట్రంగా అవతరిస్తుందని”ఉపన్యసించారు.
విశిష్ట అతిథిగా విచ్చేసిన ఉత్తరాంధ్ర జిల్లాల ఎగ్జిక్యూటివ్ ఎ.జి.ఎం ఎం.వి.సురేష్ విద్యార్థులను ఉద్దేశిస్తూ నేడు మన దేశ భవిష్యత్తు అంతా విజ్ఞాన శాస్త్రం మీదనే విద్యార్థుల మీదనే ఆధారపడి ఉందని, చిన్నప్పటి నుంచి విద్యార్థులు సైన్స్ పట్ల అత్యంత శ్రద్ధను కనబర్చాలని మీరంతా ఒక్కొక్కరు ఒక అబ్దుల్ కలాం , ఆజాద్, ఒక ఎఁజ రామన్, ఒక ఎల్లా ప్రగడ సుబ్బారావు లాగ తయారు కావాలని అప్పుడే మన భారత్ విజ్ఞనశాస్త్ర దేశంగా ప్రఖ్యాతి
గాంచుతుందని, శ్రీ చైతన్య సంస్థలు ఎంతో మంది విద్యార్థులను ఇంజనీర్లు గాను, డాక్టర్లు గాను, శాస్త్ర వేత్తలు గాను తయారు చేస్తుందని ప్రసంగించారు.
విద్యార్ధిని విద్యార్థులు ప్రదర్శించిన శాస్త్రీయ జానపద సాంఘీక, సాంస్కృతిక, నృత్య ప్రదర్శనలు మరియు లఘు నాటికలు ఆహుతులను అలరించాయి. జేఈఈ మెయిన్స్ , అడ్వాన్స్ మరియు సైన్స్ క్విజ్ పోటీలలో అత్యంత ప్రతిభను కనబర్చిన విద్యార్ధిని విద్యార్థులు ముఖ్య అతిధి , విశిష్ట అతిథి, రీజియన్ ఇంచార్జీ, ఎస్.రామినాయుడు, కో ఆర్డినేటర్ ఎ.బాల రాజు , ప్రిన్సిపల్స్, అకడమిక్ డీన్ పి.కోటేశ్వర రావు , వైస్ ప్రిన్సపాల్ పి. లోకనాథరావు చేతుల మీదుగా ప్రశంస పత్రాలు , మెడల్స్, బహుమతులను అందుకున్నారు.
అనంతరం ముఖ్య అతిధి ఎం.ఎల్.ఏ గోందు శంకర్ , విశిష్ట అతిథి ఎగ్జిక్యూటివ్ ఏ.జీ.ఎం ఎం.వి సురేష్ చేతుల మీదుగా “సైన్స్ ఎక్స్ పో “ ను ప్రారంభించారు. విద్యార్ధిని విద్యార్థులు తయారుచేసిన సైన్స్ ప్రాజెక్ట్ లు, నమూనాలు , చార్ట్ లను తిలకించి ఆనందించారు. వారు తయారు చేసిన ప్రాజెక్టులపై ప్రశ్నించి సందేహ నివృతి చేసుకొని వారు ఇచ్చిన విషయ విశ్లేషణ ను ప్రశంసించారు.

ఈ కార్య క్రమ లో ఐ.పి.ఎల్ ఇంచార్జి ఎ. హరి ప్రసాద్ మరియు బి.జనార్ధన్, సి అండ్ ఎం బ్యాచ్ ఇంచార్జీ టీ.రామ్ మోహన్, సివిల్స్ బ్యాచ్ ఇంచార్జి కే.ఉత్తమ్ కుమార్, ప్రైమరీ కో ఆర్డినేటర్ కే.అప్పారావు, ప్రైమరీ ఇంచార్జీ కె. స్వప్న, ఫిజిక్స్ ,కెమిస్ట్రీ , బయాలజీ విభాగ అధిపతులు సిహెచ్. లావణ్య, ఆర్. సత్యనారాయణ, తేజోనిధి , ఉపాధ్యాయ మరియు ఉపాధ్యాయేతర సిబ్బంది ,తల్లి తండ్రులు ఈ కార్యక్రమంలో పాల్గొని ఆద్యంతం విజయవంతం చేశారు.

# యూత్ పార్లమెంట్ గోడ పత్రికలను ఆవిష్కరించిన కలెక్టర్

**నవతరం- శ్రీకాకుళం**




కేంద్ర యువజన వ్యవహారాలు, క్రీడల మంత్రిత్వ శాఖ సౌజన్యంతో డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ విశ్వవిద్యాలయం ఎన్ఎస్ఎస్ యూనిట్, మేరా యువ భారత్ సంయుక్త ఆధ్వర్యంలో ఈనెల 5వ తేదీన ‘వికసిత్ భారత్ యూత్ పార్లమెంట్’ కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. సోమవారం జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో ఈ కార్యక్రమానికి సంబంధించిన గోడ పత్రికలను జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ యువతలో నాయకత్వ లక్షణాలను పెంపొందించేందుకు, దేశాభివృద్ధిలో వారి భాగస్వామ్యాన్ని పెంచేందుకు ఇటువంటి కార్యక్రమాలు దోహదపడతాయని పేర్కొన్నారు. గురువారం జరగనున్న ఈ యూత్ పార్లమెంట్ వేదిక ద్వారా యువత తమ గళాన్ని వినిపించాలని, వికసిత్ భారత్ సాధనలో భాగస్వాములు కావాలని కలెక్టర్ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మేరా యువ భారత్ డిప్యూటీ డైరెక్టర్ కె. వెంకట్ ఉజ్వల్, డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ వర్సిటీ ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం కోఆర్డినేటర్ డాక్టర్ వనజ తదితరులు పాల్గొన్నారు.

# కాలమనే కడలిలో... శోకమనే పడవలో...

చీకటిలో
చిమ్మ చీకటిలో...
కాలమనే కడలిలో
శోకమనే పడవలో...
ఓ మనిషీ...! ఓ మనిషీ..!!
ఎక్కడికి నీ పయనం..?
ఎందాక నీ పయనం...?

నాడు ప్రేమబంధాలతో పెనవేసి
ప్రేమ పాషాలతో బంధించి
నేడు మమతలనే మరిపించి
మనసులనే విరిచేసి ఎందుకో
భగవంతుడు బంధాలు
తెంచేసె...
బ్రతుకంతా
అంధకారమయమైపోగా...

ఓ మనిషీ..! ఓ మనిషీ..!!
ఎక్కడికి నీ పయనం...?
ఎందాక నీ పయనం....?

జాలరి వలలో చిక్కిన చేపలా
వేటగాని బాణం గుచ్చుకున్న
లేడిలా
విధి చేతిలో చిక్కి విలవిలలాడేవు
రెక్కలు విరిగిన పక్షివై
గిలగిలలాడేవు
ఓ మనిషీ..! ఓ మనిషీ..!!
ఆ దైవమే పగబడితే
ఇక ఎవరు నీకు దిక్కు ఎవరు
నీకు దిక్కు?
ఎండిన చెరువును కాదు
జలకళతో నిండిన చెరువును

చూడు
మోడువారిన మొక్కను
కాదు
పుష్పించి ఫలించే పచ్చని
వృక్షాన్ని చూడు
బ్రతకాలనే చిన్నఆశ
చిగురుస్తుంది నీలోన

ఓ మనిషీ..! ఓ
మనిషీ..!!
ఆ చిరు ఆశే
చిరుదీపంగా...
ఎందుకు
భయమెందుకు...
సాహసమే ఊపిరిగా సాగిపో
ముందుకు...
ఒక కొత్త బంగారులోకాన్ని
అన్వేషిస్తూ...



కవి రత్న
సాహిత్య ధీర,
సహస్ర కవి భూషణ్,
**పోలయ్య కూకట్లపల్లి,**
అత్తాపూర్, హైదరాబాద్

Printed by **SIRIGIRI VARADARAJU**, and published by **SIRIGIRI VARADARAJU**, on behalf of **SIRIGIRI VARADARAJU**, and printed at : Kranthi Publications, D.No.2-504/1, **Aditya Nagar** Colony, **Arasavilli,** Srikakulam,Srikakulam dist. ANDHRA PRADESH STATE - 532 401, **Published at :** Kranthi Publications, D.No.2-504/1, Srikakulam dist. ANDHRA PRADESH STATE - 532 401, Editor : **SIRIGIRI VARADARAJU**, Email: navataramraju@gmail.com, **Cell : 9959007255, 8340844777**